# కాగితం పడవ

వానకురిసి వెలిసిన రోజున ఇరుగు పొరుగు పిల్లలంతా కాగితం పడవలు వదుల్తూ కేరింతలు కొడుతూ వుంటే ఆ తల్లి హృదయం ఆనందంతో ఉప్పొంగిపోయింది. అయితే అది క్షణికం. ఆ పిల్లలు వాదులాటలు ఆమె ఆనందానికి అంతరాయం కలిగించాయి. అందుకు కారణం లేకపోలేదు... చాలా పెద్దవాన కురిసింది. వెలిసింది. కాని, యింకా వున్నాను సుమా అన్నట్లు తుప్పరగా రాలుతున్నది. రోడ్లన్నీ జలమయమైపోయాయి. చూరునించి నీళ్లింకా ధారగా కారుతున్నాయి. మనుషులు ఆ గుమ్మంలోను, యీ పంచలోను తలదాచుకున్న వాళ్ళు తెగించి, తప్పనిసరి గనుక రోడ్లమీదకు దిగి. పోతున్నారు. శకుంతల దీపాలవేళకింకా గంట వ్యవధివున్నా, లాంతరు చిమ్నీ తుడిచి, దాన్లో చమురుపోసి, వెలిగించి అంతలో ఏదో జ్ఞాపకం వచ్చిన దాన్లా, నట్టింట్లోంచి వరండాలోకి వచ్చింది. వస్తూనే "పాపం! యీయన పూర్తిగా తడిసిపోయొస్తారు కాబోలు - రేపటికి చాకింటి బట్టలు కూడా లేవు" అనుకుంది. కాని, ఆమె చూపంతా ఆరేళ్ళ రాధకోసం గుమ్మంలోనే వుంది.

రాధకి వాన కురియడం వెలిసిపోవడం రెండూ పరమానందంగా వున్నాయి. అదీ, ఎదురింటి మోహన్, యిరుగింటి రాజా, పొరుగింటి బాబ్జి అంతా సంబరంగా కేరింతలాడుతున్నారు. చూరునించి నీళ్ళు కారి తడిసిపోతున్నామని గాని, నేలకూచుని నీళ్లల్లో పడవలు వేస్తోవుంటే వెనకాతల గౌనులు, చొక్కాలు నీళ్లుతాగేస్తున్నాయని గాని జ్ఞానమే లేదా పిల్లలకి!

"రాధా! ఒసేవ్! అమ్మలూ! నిన్నేనే"-శకుంతల కేకలకి రాధ పలకలేదు. అసలు వాళ్ళీ ప్రపంచంలోనేలేరు. వాననీళ్ళు కాలవలనిండా 'లొడాలొడా' పారుతూంటే, అదేదో తను ప్రజ్ఞలాగే వుంది వాళ్ళకి. శకుంతలకి పిల్లల ఆనందానికి అడ్డుపడాలనిపించలేదు. "తడిస్తే ముక్కులంట నీళ్ళు కార్తాయి - యింత మిరియంవేసి చారు కాచేస్తా రేపు" అనుకుంది. "అదీ గాక అవతల గోరుచిక్కుడు కాయ లేరుకోవాలి - రాధను యిప్పుడు కదిపితే అది నా చెవులు పట్టుకుని వూపుతుంది" అనుకుంటూ లోపలికి వెళ్ళి చిక్కుడు కాయ లేరుకుంటోంది శకుంతల.

రాజా కత్తిపడవ చేశాడు. రాధపడవ కాస్సేపు చక్కగానే వెళ్ళింది గాని, రాజా కత్తిపడవ దాన్ని

చిన్నగా తాకింది. అదికాస్తా కాలవ అంచుకు తగిలింది. నానిపోయింది. వొడ్డుకుపోయింది. "హేయ్! హేయ్! రాధాయ్! నీ పడవాయ్! నా పడవతో రార్! నాది కత్తిపడవో!" అంటూ రాజా వానా వానా చెల్లప్పా 'తిరిగేస్తున్నాడు. రాధకి ఉడుకుమోత్తనం మహాయిదిగా వచ్చేసింది. కోపంతో రాజాని ఒక్క చెంపదెబ్బ వేద్దామనుకుంది గాని .... తనపడవ? తన పడవ ములిగి పోయిందిగా... మరోపడవ కోసం కాగితంముక్క మడిచింది. బాబ్జీ అదిచూసి "ఏయ్ రాధీ! కత్తిపడవ చెయ్యే! రాజాగాడి పడవకి ఢీ యిద్దాం" అన్నాడు.

"నాకు రాదురా!" రాధ బిక్కమొహం వేసింది.

"పోనీలే! రాజాగాడి జట్టు విప్పేయ్! మనంపోయి చూరుకింద నీళ్ళు పట్టుకునే ఆటాడుకొందాం!' ' బాబ్జీ సలహా యిచ్చాడు.

"ఉహూఁ"

"మరి? నీ కా రాజాగాడంటే యిష్టం. అందుకే వాడలా ఏడిపిస్తాడు. ఏడూ ఫో" బాబ్జీ పారిపోయాడు.

రాధకి కత్తిపడవ కావాలి... ఎలాగ? రాజాని ఓడించాలి! వుడికించాలి! ఏడిపించాలి! రాజాని వదిలిపోడం దానికి పిసరు యిష్టంలేదు.

"అమ్మ వుందిగా... అమ్మనడుగుతా". ఆవూహ తట్టడమే తడవుగా ఛెంగునలేచి పారిపోయింది యింట్లోకి రాధ.

విజయోత్సాహంతో గెంతులేస్తోన్న రాజాకి కాళ్లు కదల్లేదు. "అరె రాధాయ్! నీకు కత్తిపడవ యిస్తానే" అంటూ వాడు కూడా రివ్వున యింట్లోకి పోబోయి, గబుక్కున ఆగిపోయాడు. రాధా వాళ్ళయింట్లోకి గాక తన యింట్లోకి పారిపోయాడు.

రాధ పరిగెత్తుకుని వచ్చి "అమ్మా! అమ్మా నాక్కావాలే! కత్తిపడవ నాక్కావాలే" అంటూ తల్లి వీపుమీదకెక్కి పోయింది.

"ఏయ్! మొద్దూ! ఏమిటదీ?... యిల్లంతా తొక్కుతున్నావ్! లే... వూఁ ఏంకావాలి! రా యిలావొచ్చి కూచో. కాస్త నాకు యీ కాయలు ఏరి సాయం చెయ్యి. నాన్నా రొచ్చేవేళైంది!" అంటోనే శకుంతల రాధ చిన్నారి చేతులను తన మెడకు హత్తుకుంది. అవితీసి ముద్దెట్టుకుంది.

"నాక్కాయితం కత్తిపడవ కావాలీ!" రాధ ముందుకి వొచ్చి గునిసింది.,

"పోయి నిన్నటి పేపరు నాన్నారి బల్లమీద ఎడంచేతి కేసి వుంది తే"

రాధ క్షణంలో వచ్చింది.

శకుంతల కాగితం మడిచింది.

"అదికాదే, కత్తిపడవే! పే... ద్దద్దే... మరేమో..."

"అబ్బా! వుండవే! అదే చేస్తున్నాను"

రాధకి రాజా పడవను ముంచాలి. రాజా పొగరణచాలి. అన్నదే ఆదుర్దా... దానికి కాలు నిలవడమేలేదు.

కత్తిపడవ అవగానే తీసుకుని పారిపోయింది తుర్రున.

×××

శకుంతల, కూతురు పారిపోయిన వేపు రెండు క్షణాలు చూసి తాను కూడా వుత్సాహంగా లేచి ఆ వెనకనే గుమ్మంలోకి వెళ్ళింది.

రాధ అర్జంట్‌గా కత్తిపడవ కాలవలో వేసింది కాని రాజా ఏడీ? ...

"ప్రత్యర్థి లేకుండా గోదాలోపల దిగి ఏంలాభం!..." నిరుత్సాహ పడిపోయింది రాధ. అంతలో రాజా రివ్వున వొచ్చాడు.

"రాధాయ్! యిదుగో నీకే యీ కత్తిపడవ" వాడు కష్టపడి వాళ్ళన్నయ్య డ్రాయింగ్ పుస్తకం చింపి చేసి తెచ్చిన కత్తిపడవ నిచ్చాడు.

"నాదిచూడు... ఎంచక్కావుందో... ఛీ! నీదేం గాదు. మా అమ్మ యింత మంచిగా చేసింది"... గర్వంగా తన పడవను చూపించింది రాధ.

రాజాకి ఏడుపే వొచ్చింది.

"అయితే యీ పడవ వొద్దా?" అక్కసుగా అడిగాడు.

"ఊహూఁ"

"వొద్దా... వొద్దా.. పారేయ్‌నా? చింపేయ్‌నా?"

"నీ యిష్టం... కావాలంటే దాచుకో; నాకు మానాన్నారి పేపర్లెన్ని వున్నాయో.. మా అమ్మ బోలెడు కత్తిపడవలు చేస్తుంది..." రాధ అటు తిరిగి కూచుంది పాదాలమీద!

రాజాకి ఏం చేయాలో రెండు నిమిషాలు పాలుపోలేదు.

"సరే! వెధవ పడవలకేం గాని... నేను నిజంగా పెద్దాణ్ణై విమానం నడుపుతా తెలుసా?"

"అబద్ధాలు" అంది వెంటనే యిటు తిరిగి రాధ.

"కాదు! మానాన్నార్నడుగు... నాకు అన్నయ్యంత అవగానే కలకత్తా బొంబాయిలకి పంపేసి విమానం నేర్పుతామన్నారు" రాధకి రాజా నాన్నగారు కూడా అబద్ధమాడ తాడని గాని అబద్ధాలాడే అవసరం ఆయనకు క్కూడా కలుగుతుందనిగాని తోచలేదు. కాస్త ఆశగా "విమానాలు మనూర్లో వుండగా అక్కడి కెందుకూ?" అంది.

"మన వూరిమీదుగా వెళ్ళేవి మంచివాకావు.. అవి యిక్కడ ఆగవు" అన్నాడు రాజా.

"అయినా నాకొద్దు... నువ్వు నన్ను బాబ్జీదగ్గిర, సుశీ దగ్గర గోల చేశావ్!" అసలు కారణం చెప్పేసింది రాధ.

"అందుకేగా పెద్దాణ్ని అయి విమానంలో ఎక్కిస్తాను అనే మాటిస్తున్నాను" రాజా తన కత్తిపడవను రాధకి అందీఅందకుండా పట్టుకున్నాడు...

"అఖ్ఖర్లేదు. ఆ పడవ యిలా యియ్యి చింపి పారేస్తా" నంది రాధ.

రాజా యిచ్చేశాడు. రాధ వెంటనే నలిపే... నలిపేయలేదు... నలిపేద్దామనుకుని మానేసింది.. రాజాకి తన సర్వస్వమూ రాధ చేతుల్లో వుండటమే గాక, రాధ పడవను నలిపేస్తే కలిగే చిన్నతనం ఎంత ఎక్కువో కూడా తెలిపేభావం మొహంలోకి వచ్చేసింది!

రాధ - ఆ పడవను జాగర్తగా నీళ్ళల్లోకి వదిలేసింది. రాజాకి మొహం వెలిగింది!

"మరీ... నువ్వు విమానం ఎక్కి పెద్దచదువులికి వెళ్తావా?" రాధ అడిగింది. రాజా కళ్ళల్లోకి కుతూహలంగా చూస్తో.

"విమానమే నేను నడుపుతాను గదా. మళ్లీ బళ్లోకి ఎందుకూ?" రాజా ప్రశ్న.

"అమ్మ చెప్పింది... మాకో చిన్నాన్న వుండేవాడట! అతను విమానం యెక్కి పైచదువులకని...' ' రాధకి వూరిపేరు జ్ఞాపకం రాలేదు... "పైచదువులకనీ.. కనీ... పైచదువుల..." బుర్ర గోక్కుంటోంది. వాళ్ళ చిన్నాన్న ఏవూరెళ్ళాడో మర్చిపోయింది రాధ.

"అబద్ధాలు..." రాజా కొట్టిపారేశాడు.

"ఫో ఫో! నేనబద్ధం ఆడను... కావాలంటే మా అమ్మనడుగు. ఆ చిన్నాన్న విమానంలో వెళ్ళి ఒక తెల్ల దొరసానిని తెచ్చుకున్నాట్ట..."

"అంటే?" రాజాకి నోరు అంతా విప్పేసినా ఆశ్చర్యం తీరలేదు.

"అంటే... గౌనువేసుకుంటారు పెద్దాళ్ళూ. ఇలా ఎత్తుగా జోళ్ళు వేసుకునినడుస్తారూ."

"ఓహో.... అయితే నేనూ తెచ్చుకుంటా... మీ చిన్నాన్నదేనా మహగొప్పా?" రాజాకి అదేదో చాలా సాహసమైన కార్యమనిపించింది.

శకుంతల యిక వినలేకపోయింది వాళ్లమాటలు. "రాధా! యిలారా!" అరిచింది గట్టిగా... ఉలిక్కి పడిపోయింది రాధ. కూతుర్ని దగ్గరికి రాగానే రెక్క పట్టుకుని నట్టింట్లోకి లాక్కెళ్లి అక్కడ కూచోబెట్టి చేతులో అక్కడే పడివున్న ఎక్కాలపుస్తకం కుక్కి "చదువు ముందు పాజీ కానా!" అంది శకుంతల ఆవేశంగా.

రాధ ఏడుపు లంకించుకుంది!

శకుంతలకి కోపం తీరలేదు!

×××

సరిగ్గా తన ఏనిమిదో ఏట రాధకి యివాళ 'చిన్నాన్న'గా తను చెప్తే తెలిసిన శంకరం కూడా శకుంతలతో ఒక వానకురిసి వెలిసిన రోజున - యిలాగే కాగితం పడవలాట ఆడాడు. శంకరంబావ అంటే శకుంతలకు పంచప్రాణాలూను. శంకరంబావ ఆరోక్లాసు చదివేవాడు అప్పుడు.

"నేను నిన్ను విమానంలో లండన్ తీసుకువెళ్తాను శకూ!" అన్నాడు శంకరం బావ. శంకరం బావ అలా ఎన్నోసార్లు విమానం ఎక్కిస్తా నన్నాడు. శకుంతల నమ్మింది. శకుంతలకి స్కూలు ఫైనలు పరీక్ష లన్నీ రాసి యింటికి తిరిగి వచ్చిన తర్వాత కూడా - కలలో శంకరం బావ, తనూ విమానంలో లండన్‌కు వెళ్ళడమే అగుపించింది. అప్పటికి శంకరం బావ విదేశాలకు వెళ్ళడానికి స్కాలర్‌షిప్పుల వేటలో వున్నాడు.

శకుంతలా వాళ్ళ అమ్మా నాన్నామాట ఎలావున్నా, శకుంతలకు మాత్రం శంకరం బావ తన కోసమే విదేశాలకి, విమానాలకీ ఎగబడుతున్నాడని తోచింది. శంకరం బావతో తను తెగ తిరిగేది. ఎవరేనా ఏమేనా అంటే తిరగబడి కేకలేసి "మాబావ, నా యిష్టం" అనేది. అయితే "యీడొచ్చిన పిల్లవు నీకు పెళ్ళి అవ్వద్దా?" అన్నవాళ్ళూ వుండేవారు గనుక శంకరంతో తను ఆఖరి రోజులలో చనువు తగ్గించింది. చివరికి ఒకనాడు శంకరం లండన్ ప్రయాణ సన్నాహాల్లో వుండగా అడిగేసింది కూడా "బావా! నన్ను విమానం ఎక్కించవా?" అని "చూద్దాం శకూ నన్ను వెళ్ళి రానీ" అన్నాడు బావ.

కాని బావ వెళ్ళి వచ్చాక శకుంతలను మరి చూడనేలేదు. "దొరల పిల్లను కూడా తీసుకుని వచ్చేశాడు. శకుంతలకి తల తీసి నట్లైంది. శంకరాన్ని చంపి తాను చచ్చిపోదామనుకుంది. కాని, ఏమీ చెయ్యలేదు. అమ్మా నాన్నా సంబంధాలు వెతుకుతూవుంటే వూరుకుంది.

చివరికి తల్లితో అన్నదికూడా "అమ్మా! నాకు విమానం యెక్కాలనుందే!" అని.

తల్లి గ్రహించింది. "తల్లీ! ఏ నోము నోచామో అదే వస్తుంది గాని - మనం విమానాలూ అంటే ఎలాగా... విమానాలవాడు నీకు మనసిసిస్తాడా? వద్దు వద్దు..." అంది.

"కాదే! మరొక రెవ్వరైనా, ఐతే ఆ శంకరంబావ పొగరణగదే" అన్నది తెగించి శకుంతల.

శకుంతల పట్టుదల, అభిమానం, బాధ అలాంటివి - శకుంతల కోరినట్లు విమానం కాదుగదా కారెక్కే మొగుణ్ణేనా వెతకలేక పోయారు వాళ్ళ అమ్మా నాన్నా. సరిగ్గా అలాగే "రాధక్కూడా కాగితం పడవలు కట్టడం జరక్కూడదు" అనుకుంది శకుంతల - పిచ్చిగా తన అనుభవాన్ని రాధ విషయంలో అన్వయించుకుంటూ.

xxx

అంతలో జగన్నాథం సైకిల్ దిగుతూనే" శకుంతలా! రాధ ఎందుకు ఏడుస్తోంది?" అని కేకేశాడు.

శకుంతల వులిక్కి పడ్డది!

రాధ రివ్వునపోయి తండ్రికి ఫిర్యాదు చేసింది. అంతావిని కూతుర్ని ఎత్తుకుని బుజ్జగిస్తూ జగన్నాథం "ఏమయ్యా నేరస్తుడా! ఔనా?" అన్నాడు నవ్వుతూ భార్యను వీక్షించి.

"ఔను! దానికీ, నాకూ, విమానాలెక్కేవాళ్ళెవరొస్తారు? అందుకే యిప్పట్నించి ఖాయిదా పెడుతున్నా" నంది శకుంతల అక్కసుగా.

"ఏమో! నాకర్మ కాలి నేను సైకిలెక్కాను గాని, దీనికి మీ శంకరం బావలాంటి వాడు రాకూడదా?" అన్నాడు జగన్నాథం కూతుర్ని క్రిందకు దింపి...భార్యను ఓరకంటచూసి...

"వద్దు... వద్దు... అది కాగితం పడవలాట ఆడటం... పక్కింటి యిన్‌కంటాక్స్ ఆఫీసరుగారి కుర్రాడితో జట్టుకట్టడం... పైగా అన్నింటికి మీతో ఫిర్యాదు చెయ్యడం యివేమీవద్దు..." శకుంతల నవ్వుతూ అన్నది కాని అందులో బాధ కూడా వుంది.

జగన్నాథానికి కొంత్ అర్థం అయింది. కొంత అర్థం కాలేదు. బట్టలు మార్చుకునేందుకు ఉపక్రమిస్తూ "సరే! ఏలినవారిదయ. రాధకి కూడా ఓ నాలాంటి గుమాస్తానే యిమ్మని కోరు నీ దేవుణ్ని" అన్నాడు.

(1962,కలకత్తా ఆంధ్ర సంఘం ఏకాదశ వార్షిక సంచిక తారక 1963)